ప్రజాశక్తి

మంగళవారం 3 డిసెంబర్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్

సిఎం పర్యటనలో
ఎలాంటి పొరపాట్లకూ తావివ్వొద్దు

రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన కార్యక్రమం విద్యార్థుల జీవితాలకు బంగారు బాటలు వేసేలా ఉండాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి కోన శశిధర్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరయ్యే విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 7న బాపట్ల పర్యటన నేపథ్యంలో కోన శశిధర్, కమిషనర్ విజయరామరాజు, జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, జిల్లా ఎస్పీ తుషార్ డూడి, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మలతో కలిసి బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలను సోమవారం పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్ల సమావేశం నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరయ్యే సమావేశానికి ఏర్పాట్లను పరిశీలించారు. పాఠశాలలో కలియదిరిగారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతోనూ మాట్లాడారు. విద్యార్థుల ప్రగతి పత్రాలపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చా కార్యక్రమంపై సమీక్షించారు. పాఠశాల ఆవరణలో రంగవల్లులు, టగాఫ్ వార్ పోటీలు నిర్వహించే అంశాలపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు ఆయా తరగతి గదులను పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరయ్యే ▶ 2లో

జిల్లాల పునర్విభజన ఎప్పుడో.?

- మార్కాపురం జిల్లా కోసం ఎదురుచూపులు
- కందుకూరు, అద్దంకి నియోజకవర్గాల ప్రజలదీ అదే కాంక్ష
- గత ప్రభుత్వంలో అంతా నెలలోపే జిల్లాల విభజన నిర్ణయాలు..అమలు



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఎప్పుడో ఎన్నికలకు ముందే చంద్రబాబు గిద్దలూరు, మార్కాపురం, వైపాలెం నియోజకవర్గాల్లో ఇచ్చిన హామీ మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేయడం. ఎన్నికల్లో విజయం సాధించి కూడా ఆరు నెలలు. అంతకుముందు రెండు నెలల నుంచీ ఇదే అంశంపై పార్టీ నుంచి హామీ ఇచ్చారు. ఇంకా చెప్పాలంటే గత ప్రభుత్వం జిల్లాల ఏర్పాటు సమయంలోనే మార్కాపురం కోసం ఉద్యమం జరిగింది. అన్ని పార్టీలూ మార్కాపురం జిల్లా కోసం పోరాటాలు చేశాయి. అప్పుడే తెలుగుదేశం నేతలు ప్రకటించారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చే ఆరు నెలలవుతోంది. ఇప్పటికీ మార్కాపురం జిల్లా ఏర్పాటు గానీ, ప్రకాశం జిల్లాలో కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను కలిపే ప్రక్రియ గానీ చర్చలో లేదు. అప్పట్లో ప్రజల్లో దీనిపై బాగా వేడి ఉన్నందున ఎజెండాగా తీసుకుని ఎన్నికల్లో అస్త్రంగా వాడుకున్నారు.

ఇప్పుడు కారణాలేమైనా జిల్లాల పునర్విభజనపై ముందుకు రావడం లేదనే చర్చ ఉంది. వాయిదాలు వేస్తూ వస్తున్నారు. ఇంకా సమయం ఉందనే మాట నేతల వద్ద వినిపిస్తోంది. ఎన్నికలకు ముందు ఎంతో వాడివేడిగా ఉన్న మార్కాపురం జిల్లా అంశం ఇప్పుడు పాలకపక్షంలో చల్లబడింది. దీనికోసం పోరాటాలు చేసిన పార్టీలు కూడా కూటమి ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాయి. జనం కూడా ఇదే భావనలో ఉన్నారు. చేస్తారనే ఆశతోనే ఉన్నారు. అద్దంకి నియోజకవర్గంలోనూ అప్పటి ఎమ్మెల్యే గొట్టిపాటి కూడా ఇదే నినాదం ఎత్తుకున్నారు. లోకేష్ పర్యటనలోనూ జిల్లాల అంశం ప్రధాన ఎజండాగా వాడారు. ఆయన కూడా ఇప్పుడు మంత్రిగా ఉన్నప్పటికీ మౌనంగా ఉన్నారు. చంద్రబాబు నిర్ణయంపై ఆధారపడి ఉన్నందున ఎవరూ నోరువిప్పడం లేదు. పంథా మారిందా? కొత్త జిల్లాల ఏర్పాటుపై మరేదేమైనా ఆలోచన ఉందా? అన్నదీ చూడాల్సి ఉంది. తెలుగుదేశం పార్టీ గట్టిగానే ఈ హామీని ఇచ్చింది. వైసిపి నేతలు కూడా తమకు నష్టం కలిగిస్తుందని భావించారు. అదే జరిగిందని అంతర్మథనం చెందారు. ఎవరిమాట వినకుండా అసంబద్ధంగా జిల్లాల విభజన ఉంది. దూరంగా ఉన్న ప్రాంతాలు అదే విధంగా ఉన్నాయి.

జిల్లా కేంద్రానికి దగ్గరలో ఉన్న నియోజకవర్గాలు దూరంగా పోయాయి. కందుకూరు ప్రజలు ఇప్పటికీ నెల్లూరు జిల్లాకు వెళ్లలేకపోతున్నారు. ఒంగోలు జిల్లాలోనే ఉంచాలనే డిమాండులోనే ఉన్నారు. అప్పటి వైసిపి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులతో వచ్చి కందుకూరును ప్రకాశంలోనే ఉంచాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. అందరి అభ్యర్థనలు బుట్టదాఖలయ్యాయి. పార్లమెంటు పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గాలతో జిల్లా ఏర్పాటు చేశారు. అనివార్యంగా సంతనూతలపాడును ప్రకాశంలో ఉంచారు. మార్కాపురం జిల్లా డిమాండ్ ఎంతో శాస్త్రీయంగా ఉన్నా పట్టించుకోలేదు. కొత్త జిల్లాల వల్ల మార్కాపురం ప్రాంత ప్రజలకు పాలనాసౌలభ్యం రాలేదు. ఇప్పటికీ పేదలు అర్జీలు ఇవ్వడానికి ఒంగోలు వస్తున్నారు. వైపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల నుంచి సోమవారం నాడు వందలాది మంది ప్రజా దర్బారుకు ▶ 2లో

విద్యుత్ శాఖలో
అవినీతి జలగలు.!

- స్వలాభం కోసమే పనిచేస్తున్న కీలక అధికారులు
- మార్కాపురంలోని అధికారుల తీరుతో నష్టాల బాటలో సంస్థ



పడేసిన విద్యుత్ మీటర్లు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం సబ్ డివిజన్‌లోని విద్యుత్ శాఖలో అవినీతి జలగలు రాజ్యమేలుతున్నాయి. కొందరు కీలక అధికారులు స్వలాభం కోసం చేసే పనులతో సంస్థ నష్టాల బాట పడుతోంది. మార్టూరు ప్రాంతంలో విద్యుత్ శాఖలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడి.. బదిలీపై వచ్చిన ఓ అధికారి మార్కాపురంలో కీలక బాధ్యతల్లో ఉన్నారు. ఆ తరువాత స్థానంలో ఉన్న మరో కీలక అధికారి కూడా అవినీతికి వంతపలకడం గమనార్హం.!

మార్కాపురం డివిజన్ విద్యుత్ శాఖలో కీలక అధికారులది ఇష్టారాజ్యమైంది. వినియోగదారులు, రైతులు నుంచి అక్రమ ఆదాయం చాలదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. విద్యుత్ బిల్లులు కూడా విద్యుత్ శాఖకు చెందకుండా జిమ్మిక్కులకు పాల్పడుతున్నారు. కీలక అధికారికి వంతపాడిన మరో కీలక అధికారికి యర్రగొండపాలెం ఏరియా బాధ్యతలు కూడా అప్పగించారు. అక్కడకు మరో అధికారి రాకుండా తెలివితేటలు ప్రదర్శించారు. ఏ ఒక్క సెక్షన్ ఆఫీసర్ కూడా లేకుండా వ్యవహరించారు. సబ్ డివిజన్‌లో కీలక అధికారి అనుకూలమైన జెఎల్‌ఎంలను ద్వితీయ శ్రేణి కీలక అధికారి ప్రోత్సహిస్తున్నారు. అక్రమాలు ఎలా చేయాలో అవగాహన కల్పించారు. విద్యుత్ వినియోగదారులతో చేతులు కలిపారు. పెద్ద మొత్తంలో వచ్చిన బిల్లులు సైతం చెల్లించాల్సిన పనిలేకుండా వ్యవహరిస్తున్నారు. తద్వారా విద్యుత్ శాఖకు నష్టం వాటిల్లుతోంది. పెద్ద మొత్తంలో వచ్చిన బిల్లుల్లో సగం అధికారులకు ఇస్తే చాలన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. వచ్చిన బిల్లులో సగం తగ్గిపోతుండటంతో వినియోగదారులు కూడా అక్రమాలకు సై అంటున్నారు. అక్రమాలకు సహకరించిన వినియోగదారులకు అనుకూలంగా నివేదికలు తయారు చేస్తున్నారు. విద్యుత్ మీటర్లలో లోపం ఉందని తేల్చడం... ఆ తరువాత ఆ మీటర్లను మంటల్లో తగలేయడం జరుగుతోంది. ఈ లెక్కన పెద్దఎత్తున అక్రమార్జన కూడబెడుతున్నారు. గృహ విద్యుత్ వినియోగం దగ్గర నుండీ పరిశ్రమల వరకూ ఇదే తంతు నడుస్తోందని తెలిసింది. ఈ విధంగా విద్యుత్ సంస్థకు భారీగా ఆర్థిక నష్టాలకు కీలక అధికారులే కారణమని ఆరోపణలు ఉన్నాయి. స్వలాభం కోసం ఉన్నతాధికారులను సైతం మాయజాలంలో పడేస్తున్నారు. ఇటీవల కాలంలో యర్రగొండపాలెం ప్రాంతంలోని బోయలపల్లి గ్రామంలో ఇదే తరహాలో జరిగింది. ఈ విధంగా విద్యుత్ మీటర్లను ప్రతినెలా పదుల సంఖ్యలో తగలబెట్టడం గమనార్హం.

నిబంధనలకు తూట్లు

ఇక్కడి అధికారులు నిబంధనలు పాటించడం లేదు. విద్యుత్ బిల్లుల విషయంలో అదే జరుగుతోంది. రూ. 50 వేలు ▶ 2లో

లైంగిక వేధింపులకు పాల్పడే వారికి
ఇలాంటి తీర్పులు గుణపాఠం

ఎస్పీ దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

లైంగిక వేధింపులు, అత్యాచారాలకు పాల్పడే వారికి కోర్టు తీర్పులు గుణపాఠమని జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ తెలిపారు. ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ నిందితుడికి మరణించే వరకు జైలు శిక్ష విధించిన ఒంగోలు ఫోక్సో కోర్టు ఇన్‌చార్జి జడ్జి తీర్పును ప్రస్తావిస్తూ.. ఎస్పీ మాట్లాడారు. మహిళలు/బాలబాలికలపై అఘాయిత్యాలు జరగ కుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. చిన్న పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడే వారు ఎట్టి పరిస్థితుల్లో చట్టం నుండి తప్పించుకునే వీలు లేకుండా కోర్టులో పకడ్బందీగా ట్రయిల్ మానిటరింగ్ చేస్తూ నిందితులకు కఠిన శిక్షలు పడేలా కృషి చేస్తున్నామని తెలిపారు. గత 20 రోజుల నుండి జిల్లా వ్యాప్తంగా పాఠశాలు/కళాశాలల్లోని విద్యార్థినులకు గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ మధ్య తేడా తెలుసుకోవడం, స్వీయ రక్షణ, మహిళలపై జరుగుతున్న నేరాలు, ఈవ్ టీజింగ్, ప్రేమ పేరుతో జరిగే మోసాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఉన్న చట్టాలు, ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు/మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లపై అవగాహన కల్పించి వారు బంగారు భవిష్యత్తు వైపు నడిచేలా మార్గ నిర్దేశం చేస్తున్నామన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో
నిందితుడికి మరణించేంత వరకు జైలు

మెయిన్ లో ▶



ట్రై సైకిల్ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్

వికలాంగ విద్యార్థులను ప్రోత్సహించేలా పోటీలు

8లో ▶

సిరులు కురిపిస్తున్న జామాయిల్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఏడాది క్రితం వరకు జామాయిల్ సాగంటే ఆమడదూరం ఉన్న రైతులు ఈ ఏడాది ఎక్కడ భూమి ఉన్న ఆ భూమిలో జామాయిల్ సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. దీనికి ప్రధాన కారణం టన్ను జామాయిల్ ధర రూ.7 వేలు ధర పలకడమే. యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లో ఈ ఏడాది సుమారు మూడు వేల ఎకరాల్లో జామాయిల్ తోటలు సాగు చేశారు. ఇప్పటి దాకా ఎక్కువగా పత్తి, మిర్చి, కంది తదితర పంటలను సాగు చేశారు. చీడ పీడల ఉధృతితో పాటు అతివృష్టి, అనావృష్టితో సరిగా పంటలు కూడా పండటం లేదు. పండిన పంటలకు గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు నష్టాల పాలవుతున్నారు. ఈ క్రమంలో జామాయిల్ ధర టన్ను రూ.7 వేలకు పైన పలుకుతుండడంతో రైతులు ఈ పంటపై దృష్టి సారించారు. వాతావరణ పరిస్థితి ఎలా ఉన్నా జామాయిల్ సాగుకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. అలాగే కూలీల కొరత కూడా ఉండదు. ఈ క్రమంలో నాలుగైదేళ్లలో జాగ్రత్తగా సాగు చేస్తే పంట చేతికి వస్తుంది. ఎకరానికి 30 టన్నులకు పైగా దిగుబడి వస్తే ఆశించినంత గిట్టుబాటు ధర ఉంటే రైతులు లాభాలు ఆర్జించే అవకాశం ఉంది. దీంతో రైతులు మిర్చి, పత్తి సాగును తగ్గించి జామాయిల్ సాగుపై దృష్టి పెట్టారు. రైతులు రాళ్ల భూముల్లో సైతం జామాయిల్ పంటను సాగు చేస్తున్నారు. తోటలు సైతం ఇటీవల కురిసిన వర్షాలకు ఏపుగా పెరిగి పచ్చగా కళకళలాడుతున్నాయి. ఫలితంగా లాభాలు వస్తాయని రైతులు ఆశ పడుతున్నారు.


జామాయిల్ తోట

జిల్లాల పునర్విభజన ఎప్పుడో.?

(మొదటిపేజీ తరువాయి)

వంద, 150 కిలోమీటర్ల నుంచీ వస్తున్నారు. ఇదేనా పాలనా సౌలభ్యం అనేది ఆలోచించాలి. అప్పట్లో వైసిపి నేతలు ఇవేవీపట్టించుకోకుండా జిల్లాల విభజన చేశారు. జనం మాట పెడచెవిన పెట్టారు. ఫలితం ఎన్నికల్లో చూశారు. ఈ విషయం ఇప్పుడు పాలకపక్ష నేతలకూ తెలిసిందే. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం జిల్లాలపై ఏ నిర్ణయం తీసుకోలేదు. వాస్తవానికి కొత్త జిల్లాల ఏర్పాటు నిర్ణయం, అమలు అన్నీ ఒక నెలరోజుల్లోనే గత ప్రభుత్వం చేపట్టింది. ఇపుడు ఆరు నెలలు గడిచినా నిర్ణయం తీసుకోలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందనే చర్చ సాగుతోంది. ఇప్పటికైనా మంత్రులు ఇద్దరూ, జిల్లా నేతలు జిల్లాల పునర్విభజనపై దృష్టి సారిస్తారని ఆశిద్దాం.

విద్యుత్ శాఖలో అవినీతి జలగలు.!

(మొదటిపేజీ తరువాయి)

పైబడిన బిల్లుల వసూలు బాధ్యత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌దే. రూ. 20 వేలు పైబడిన బకాయి డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుపై ఉంది. ఆవేమీ పట్టవన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. డివిజన్‌లో బిల్లుల గురించి పట్టించుకోకపోవడంతో రూ.కోట్లలో పేరుకుపోయాయి. కింది స్థాయి సిబ్బందిని మాత్రం దుర్భాషలాడటం పరిపాటిగా మారింది. కిందిస్థాయి సిబ్బందిని పురుగును చూసినట్లు చూస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సిబ్బంది కూడా కీలక అధికారుల వ్యవహార్తశైలితో అసహనానికి గురవుతున్నట్లు తెలిసింది.

బదిలీల్లోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇటీవల యర్రగొండపాలెం నుంచి మార్కాపురం ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్‌ను హిటిలైజేషన్ పేరుతో నియమించుకున్నారు. కీలక అధికారుల స్వలాభం కోసం కొత్తగా వచ్చిన జూనియర్ అసిస్టెంట్‌ను కంట్రోల్‌లో పెట్టుకున్నారు.

విద్యుత్ శాఖలో అధికారుల అక్రమ ఆదాయం కోసం కాంట్రాక్టర్లకు సైతం అడుగులకు మడుగులొత్తుతున్నారు. విద్యుత్ సంస్థ ఏమైనా పర్వాలేదు... తాము బాగుంటే చాలన్నట్లుగా ఇక్కడి అధికారుల తీరు కొనసాగుతోంది. మార్కాపురం డివిజన్ విద్యుత్ శాఖలో జరుగుతున్న 'అవినీతి'పై సమగ్ర విచారణ చేపడితే 'అనకొండలు' బయటపడే అవకాశం లేకపోలేదు.!

సిఎం పర్యటనలో..

ఎలాంటి పొరపాట్లకూ తావివ్వొద్దు..

(మొదటిపేజీ తరువాయి)

తల్లిదండ్రుల సమావేశంలో ఎక్కడెక్కడ పాల్గొంటారో చర్చించారు. విద్యార్థులతో చర్చించే ప్రాంతం, భోజనం చేసే ప్రాంతం, పరిశీలించే పాఠశాల భవనం తరగతి గదులను పరిశీలించారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కు కేవలం విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులను మాత్రమే పాఠశాలలోకి అనుమతించాలన్నారు. ఇతరులను అనుమతించరాదన్నారు. పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యా బోధన జరుగుతుండగా 919 మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. వారి తల్లిదండ్రులందరినీ పిలిపించాలన్నారు. మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు సిద్ధం చేయాలన్నారు. అధికారులు మరింత పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

తల్లిదండ్రుల సమావేశానికి ఆహ్వాన పత్రికలను విద్యార్థులే సిద్ధం చేస్తున్నారని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. సజనాత్మకతతో విద్యార్థులు తయారుచేసిన ఆహ్వాన పత్రికలను సచివాలయాల సిబ్బంది తల్లిదండ్రులకు అందజేస్తారని చెప్పారు. విద్యార్థులతో రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం జయప్రదం చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాట్లను ప్రిన్సిపల్ సెక్రటరీకి ఆయన వివరించారు. పోలీస్ కవాతు మైదానంలో హెలిప్యాడ్ సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, బుడా చైర్మన్ రాజశేఖర్ బాబు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దొంగల చేతివాటం

కొండపిలో ట్రాక్టర్ చోరీపై కేసు నమోదు

జిల్లాలో పలుచోట్ల దొంగలు చేతివాటం ప్రదర్శించారు. కొండపిలో ఇంటి వద్ద ఉంచిన ట్రాక్టర్‌ను దొంగలు అపహరించగా మద్దిపాడు మండలం పెద్దకొత్తపల్లిలో ఎవరూ లేని ఇంట్లో బీరువా పగులకొట్టి బంగారం, నగదు అపహరించారు. అలాగే శింగరాయకొండ పంచాయతీలోని సుందర్‌నగర్‌లో పట్టపగలే ఇంటి తాళాలు పగుకొట్టి బీరువాలోని బంగారు ఆభరణాలు రూ.20 వేల నగదు అపహరించారు.



కొండపిలో చోరీకి గురైన ట్రాక్టర్



దొంగలు పగులకొట్టిన బీరువా

ప్రజాశక్తి-కొండపి

కొండపి గ్రామానికి చెందిన గుమ్మళ్ల రాంబాబు అనే వ్యక్తికి సంబంధించిన ట్రాక్టర్ ఆదివారం రాత్రి చోరీకి గురయింది. ఈ విషయంపై కొండపి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. వివరాల్లోకి వెళితే.. గుమ్మళ్ల రాంబాబు తమ రెండు ట్రాక్టర్లను ఎప్పటిలాగానే ఇంటి వద్ద ఆపుకొని ఉన్నాడు. రాంబాబు ట్రాక్టర్ డ్రైవరు సోమవారం ఉదయం నాలుగు గంటలకే ట్రాక్టర్ ఉంచిన చోటకు వచ్చి చూడగా అందులో ఒక ట్రాక్టర్ కనిపించలేదు. దీంతో రాంబాబు ఆది వారం రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్ నెంబర్ ఏపి 39 యుఆర్ 6276ను దొంగిలించినట్లు గుర్తించి కొండపి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ ప్రేమ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా పైన తెలిపిన ట్రాక్టర్ నెంబర్ గుర్తించినట్లయితే కొండపి సిఐ 9121102114, కొండపి ఎస్ఐ 9121102109లలో తెలియజేయాలని కోరారు.

పెద్దకొత్తపల్లిలో తాళం వేసిన ఇంట్లో..

మద్దిపాడు: బీరువా పగులకొట్టి బంగారం, నగదు అపహరించిన సంఘటన మండల పరిధిలోని పెద్ద కొత్తపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కాటా భారతి గత నెల 8వ తేదీన బెంగళూరులో ఉంటున్న తన కుమారుడి వద్దకి వెళ్ళింది. 25 రోజుల తర్వాత తిరిగి స్వగ్రామం అయిన పెద్దకొత్తపల్లికి సోమవారం చేరుకుంది. ఇంట్లోకి వెళ్ళగా తాళాలు పగల కొట్టి బీరువాలో ఉన్న సుమారు ఐదున్నర సవర్ల బంగారం చైను, రెండు ఉంగరాలు, రెండు ఇత్తడి బుంగలు, కొంత నగదు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

శింగరాయకొండ: శింగరాయకొండ గ్రామపంచాయతీ పరిధిలోని సుందర నగర్‌లో పట్టపగలు ఇంటి తాళాలు పగల గొట్టి చోరీ చేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ బి.మహేంద్ర తెలి పిన వివరాల ప్రకారం.. సుందర్ నగర్‌లో నివాసముంటున్న కుంచాల సునీత ఉద యం పెరల్ డిస్టలరీలోకి పనికి, ఆమె కుమారుడు అఖిల్ కళాశాలకు వెళ్లడంతో ఇంటికి తాళం వేసి ఉండడానికి గమనించిన దొంగలు ఇంటి తాళం పగలగొట్టి ఇంటిలోని బీరువాను పగలగొట్టి బీరువాలో ఉన్న మూడు జతల కమ్మలు, రెండు ఉంగరాలు, రూ.20 వేల నగదును దొంగిలించారు. బాధితురాలు కుంచాల సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ఇంటిని పరిశీలించి, ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు కూడా పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఒంగోలు క్లూస్ టీం బృందం వచ్చి వేలిముద్రలు కూడా సేకరించడం జరిగిందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్రైమ్ కాలమ్



మృతి చెందిన జస్వంత్

చెరువులో ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

ప్రజాశక్తి - పర్చూరు

చెరువులో ఈతకు వెళ్లిన విద్యార్థి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వీరన్నపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకోగా చెరువులో గాలింపు చేపట్టి సోమవారం ఉదయం ఎట్టకేలకు విద్యార్థి మృతదేహం వెలికితీశారు. ఎస్ఐ మాల్యాద్రి అందించిన వివరాల మేరకు.. వీరన్నపాలెం గ్రామానికి చెందిన పాలేరు జస్వంత్ (17) మరో ఇద్దరు స్నేహితులతో కలిసి ఈత కొట్టడానికి చెరువులో దిగారు. ఈత రాక జస్వంత్ చెరువులో మునిగిపోయాడు. చెరువు నుండి బయటకు వచ్చిన స్నేహితులు గ్రామంలో సమాచారం ఇవ్వగా స్థానికులు గాలింపు చేపట్టారు. అయినా మృతదేహం దొరకలేదు. చీరాల నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది చెరువులో గాలించి ఎట్టకేలకు విద్యార్థి మృతదేహాన్ని బయటికి తీశారు. విద్యార్థి మృత దేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-అద్దంకి

పట్టణంలోని కలవకూరు రోడ్డులోని నవత ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం వద్ద మురుగు కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సోమవారం స్థానికులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది అక్కడికి వెళ్ళి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడు ఎవరనేది ఇంతవరకు తెలియ రాలేదు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారు. గుర్తు తెలియని మృతదేహంగా పోలీసులు కేసు నమోదు చేశారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : ఆర్‌డీవో

ప్రజాశక్తి-రేపల్లె

అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆర్‌డీవో రామ లక్ష్మి అధికారులను ఆదేశించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వచ్చిన దరఖాస్తుల వివరాలను ఆర్డీవో వివరించారు. మొత్తం పది అర్జీలు వచ్చినట్లు ఆమె తెలిపారు. వీటిలో చెరుకుపల్లి మండలం రాంబొట్లవానిపాలెంలో రైస్ మిల్లుతో వచ్చే కాలుష్యం వలన ఇబ్బంది కలుగుతుందని సదరు నిర్మాణమును నిలిపివేయాలని కోరారు. పెద్దపులివర్రు గ్రామానికి చెందిన బస్సు ప్రసాద్‌రావు తన పొలాన్ని ఆక్రమించారని, గూడవల్లి గ్రామానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి టి.వసంత బాబు తనను అధికారులు వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

పంగులూరు: సోమవారం పంగులూరులోని తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌కు 11 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ సింగారావు తెలిపారు. ఇందులో డిజిటల్ సిగ్నేచర్‌కు సంబంధించి రెండు, పొలం కొలతలకు రెండు, పట్టాదారు పాసు పుస్తకాల కోసం రెండు, పాస్ పుస్తకంలో పేరు సవరణ కోసం ఒకటి, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం నాలుగు అర్జీలు మొత్తం 11 అర్జీలు వచ్చాయని ఆయన తెలిపారు. ఆన్‌లైన్ నమోదులో పేర్లు తారుమారయ్యాయని, సమ స్యను పరిష్కరించాలని మార్టూరు మండలం, బొల్లాపల్లికి చెందిన రైతు వీరవల్లి కృష్ణమూర్తి సోమవారం తహశీ ల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై గత ఆరు సంవత్సరాలుగా పంగులూరు తహశీల్దార్ కార్యాల యం చుట్టూ తిరుగుతున్నా సమస్యను పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తహశీల్దార్ వెంటనే కొండమంజులూరు వీఆర్వోను పిలిచి వెంటనే సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. త్వరలోనే నీ సమస్య పరిష్కరిస్తానని వీరవల్లి కృష్ణమూర్తికి తహశీల్దార్ సింగారావు హామీ ఇచ్చారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని చిలకపాడు గ్రామంలో పాలపర్తి రాంబాబు అనే వ్యక్తికి చెందిన గొర్రెల దొడ్డిపై ఆదివారం రాత్రి వీధి కుక్కలు దాడి చేయగా 15 గొర్రె పిల్లలు మృతి చెందాయి. ఆ దొడ్డిలో మొత్తం 17 గొర్రె పిల్లలు ఉండగా వాటిలో 15 మృతి చెందాయి. మరో రెండు చిన్న పిల్లలు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో సుమారు రూ.80 వేల నుంచి లక్ష రూపాయల మేర ఆస్తి నష్టం జరిగిందని పేద వర్గానికి చెందిన గొర్రెల యజమాని రాంబాబు లబోదిబోమంటున్నాడు.

అవినీతిపై విచారణ జరిపించాలని వినతి

ప్రజాశక్తి-బాపట్ల



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న జోగి రాజా

ఇటీవల విజయవాడలో సంభవించిన వరద బాధితులకు సహాయం అందించేందుకు బాపట్ల పురపాలక సంఘం నుంచి వెచ్చించిన రూ.40.55 లక్షల ఖర్చుల్లో రూ.10 లక్షలు దుర్వినియోగం అయ్యాయని, దీనిపై విచారణ జరిపించాలని బాపట్ల పట్టణానికి చెందిన వైసిపి నాయకులు జోగి రాజా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన కలెక్టర్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ బాపట్ల పురపాలక సంఘం వరదల బాధితుల సహాయార్థం భోజనం ప్యాకెట్లు, బిస్కెట్లు, పాలు, ఆహార పొట్లాలు రెవెన్యూ అధికారుల ద్వారా సరఫరా చేయడం జరిగిందన్నారు. రూ.2 లక్షల వాటర్ బాటిళ్లు సరఫరా చేశారని తెలిపారు. బాపట్ల పురపాలక సంఘ సాధారణ నిధుల నుంచి రూ.40.55 లక్షలు ఖర్చు చేసినట్లు సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం అందించారన్నారు. విజయవాడలో 32వ డివిజన్‌లోని వివిధ సచివాలయాల పరిధిలో వరద బాధితులకు 2 లక్షల వాటర్ బాటిళ్ళు, సుమారుగా 15,250 మందికి ఆహార ప్యాకెట్లు, బిస్కెట్లు, పాలు అందించారని తెలిపారు. వాటర్ బాటిల్స్ మెస్సర్స్ వినీల ఎంటర్‌ప్రైజెస్, న్యూ శరాఫ్ బజార్ బాపట్ల, కంకటపాలెంకు చెందిన కాంట్రాక్టర్ యార్లగడ్డ వీరయ్య చౌదరి ద్వారా సరఫరా చేసినట్లు తెలిపారు. మెస్సర్స్ వినీల ఎంటర్‌ప్రైజెస్‌కు రూ.15,63,540, యార్లగడ్డ వీరయ్య చౌదరికి రూ.14,91,651లను పురపాలక సంఘం సాధారణ నిధులు నుంచి చెల్లించినట్లు సమాచారం ఇచ్చారన్నారు. రూ.30.55 లక్షలు, ఖర్చుకు రూ.40.55 లక్షలు ఖర్చయినట్లు సమాచారంలో పేర్కొన్నారన్నారు. అయితే అదనంగా రూ.10 లక్షలు నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. దీనిపై విచారణ జరిపించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించామని జోగి రాజా తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


సిమెంట్ గ్రావెల్‌ను ఢీకొన్న బైకు -మరో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - చీరాల, వేటపాలెం:

మధ్యం మత్తులో రోడ్డుకి అడ్డంగా ఉన్న సిమెంట్ గ్రావెల్ ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం పాలైన సంఘటన సోమవారం రాత్రి వేటపాలెం మం డలం పొట్టి సుబ్బయ్య పాలెం గ్రామ పంచాయతీ పరిధిలో మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌కి సంబంధించి నిర్మాణంలో ఉన్న క్రిస్టల్ విల్లాస్ వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వేటపాలెంకు చెందిన నలుగురు యువకులు రెండు బైకుల మీద సోమవారం సాయంత్రం పొట్టి సుబ్బయ్య పాలెం సముద్ర తీరానికి వెళ్లారు. వారు అప్పటికే మద్యం సేవించి తిరుగు ప్రయాణంలో అతివేగంగా వస్తూ నిర్మాణంలో ఉన్న క్రిస్టల్ విల్లాస్ వద్ద రోడ్డుకు అడ్డంగా ఉన్న సిమెంట్ గ్రావెల్ మాల్ దిబ్బను ఢీకొట్టడంతో యర్రవరపు కళ్యాణ్ రామ్ (20) అక్కడికక్కడే మృతి చెందగా కంచర్ల వెంకట మనోజ్‌కు తీవ్ర గా యాలయ్యాయి. ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న వేటపాలెం ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను చీరాల ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. సంఘటనా స్థలంలో రోడ్డుకి అడ్డంగా ఉన్న క్రిస్టల్ విల్లాస్ నిర్మాణ పనుల తాలూకు సిమెంట్ గ్రావెల్‌ను తొలగించే చర్యలు చేపట్టారు. నిర్మాణంలో ఉన్న క్రిస్టల్ విల్లాస్ నిర్వాహకులు బాధ్యతారాహిత్యం కారణంగా రోడ్డుకి అడ్డంగా ఉన్న సిమెంట్ గ్రావెల్ మాల్‌ను ద్విచక్ర వాహనదారుడు ఢీకొని ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

శ్రీశైలం ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని శ్రీశైలం ఘాట్‌లో సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల చింతల సమీపంలో నరసరావుపేటకు చెందిన ఆర్టీసీ బస్సు, టెంపో వాహనం ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదు. వాహ నాలు దెబ్బతిన్నాయి. దీంతో కొంత మేరకు ట్రాఫిక్‌కు అంత రాయం ఏర్పడింది. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

రబీపైనే ఆశలు

- నిరాశ మిగిల్చిన ఖరీఫ్.. - నష్టాలతో కుదేలవుతున్న రైతన్నలు



ఎండుముఖం పట్టిన పత్తి తోట

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఖరీఫ్ సాగులో తీవ్ర వర్షాభావంతో యర్రగొండపాలెం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని అన్నదాతల ఆశలు ఆవిరయ్యాయి. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో, కురిసినప్పుడు అతిగా కురవడంతో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలన్నీ అన్నదాతలకు ఆర్థిక నష్టాలను మిగిల్చాయి. ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు వరుణుడిపై ఆశలు పెట్టుకొని పంటల సాగులో నిమగ్నమయ్యారు. ఇప్పటికే రబీ సీజనులో శనగ, మినుము, జొన్న, పత్తి, కంది వీటితో పాటు కూరగాయల సాగు అధికంగా వుంది. అయితే ఆశించిన వర్షపాతం నమోదు కాకపోవడంతో పంటల దిగుబడి ప్రశ్నార్థకంగా మారింది. వర్షాభావ పరిస్థితి ఇలాగే కొనసాగితే పంటలు ఎండిపోయి తీవ్రనష్టం వాటిల్లే ప్రమాదం వుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ముఖ్యంగా సాగులో ఉన్న పంటలను కాపాడు కునేందుకు రైతన్నలు వర్షంకోసం ఎదురుచూస్తున్నారు.

యర్రగొండపాలెం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఖరీఫ్‌లో యర్రగొండపాలెం మండలంలో 19,065 ఎక రాలు సాధారణ సాగు విస్తీర్ణం కాగా 21,111 ఎకరాల్లో సాగయ్యాయి. పుల్లలచెరువు మండలంలో 25,127 ఎకరాలు సాధారణ సాగు విస్తీర్ణం కాగా 23,514 ఎకరాల్లో సాగు చేశారు. త్రిపురాంతకం మండలంలో 19,710 ఎకరాలు సాధారణ సాగు విస్తీర్ణం కాగా 16,534 ఎకరాల్లో సాగయ్యాయి. పెద్దదోర్నాల మండలంలో 11,734 ఎకరాలు సాధారణ సాగు విస్తీర్ణం కాగా 7,721 ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుత రబీ సీజన్‌లో యర్రగొండపాలెం మండలంలో 1,195 ఎకరాలు సాధారణ సాగు విస్తీర్ణం కాగా 153 ఎకరాల్లో సాగయ్యాయి. పుల్లలచెరువు మం డలంలో 5,256 ఎకరాలు సాధారణ సాగు విస్తీర్ణం కాగా 177 ఎకరాల్లో సాగయ్యాయి. త్రిపురాంతకం మండలంలో 8,131 ఎకరాలు సాధారణ సాగు విస్తీర్ణం కాగా 294 ఎకరాల్లో సాగు చేశారు. పెద్దదోర్నాల మండలంలో 3,902 ఎకరాలు సాధారణ సాగు విస్తీర్ణం కాగా 2,035 ఎకరాల్లో ఇప్పటికి వివిధ రకాల పంటలు సాగయ్యాయి.

రైతాంగాన్ని ఆదుకోవాలి

వాతావరణ అనుకూల పరిస్థితుల మధ్య ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రైతాంగానికి నిరాశ మిగిల్చింది. ఇదే క్రమంలో రైతులు రబీ సీజన్‌పై ఆశలు పెట్టుకున్నారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో రబీ సీజన్‌లో కూడా రైతులు పంటలు వేయలేని పరిస్థితి నెలకొంది. తమ భూములను సాగుకు సిద్ధం చేసుకొని వర్షం కోసం ఎదురు చూడాల్సి వస్తోందని వాపోతున్నారు. దీనికి తోడు రబీ పంటలకు బీమా ప్రీమియంను కూడా సాగుదారులే చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఎరువుల ధరలు పెరిగాయి. దీంతో పంటలు వేయడమే గగనంగా మారింది.

పత్తి పంటకు నష్టం వాటిల్లుతుంది



ఇప్పటికే పత్తి పంట సాగుచేసిన రైతులు వర్షం కురవకపోవడంతో ఆందోళనతో వున్నారు. మరి కొద్ది రోజుల్లో వర్షం కురవకపోతే పత్తి పంటకు నష్టం వాటిల్లుతుంది. గత ఖరీఫ్ సీజనులో కూడా అరకొర వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి.

- రామావత్ బాలు నాయక్, రైతు, పిల్లికుంట తాండా

వర్షంకోసం ఎదురుచూపు



సుమారు ఐదు ఎకరాల్లో వేర్వేరుగా మిర్చి, మినుము సాగు చేశా.. ఇప్పటికే బెట్టతో పంటలకు నష్టం జరుగు తోంది. 15 రోజుల్లో వర్షం కురవకపో తే పంటలు ఎండిపోయే అవకాశాలు ఉన్నాయి. మిరప సాగుపై ఆశతో పెట్టుబడులు పెట్టి వర్షం కోసం ఎదురుచూస్తున్నాం.

- రామావత్ బాలు నాయక్, రైతు, పెద్దపీఆర్‌సి తాండా

ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి



ఈ పాటికే నష్టాల్లో ఉన్నాం. రబీ పరిస్థితి అంతే ఉంది. ఈ క్రమంలో బీమా ప్రీమియాన్ని చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీంతో భారంగా మారింది. పెరిగిన ఎరువులతో సతమతమవుతున్నాము. సాగు చేసిన పంటల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- గోసుల సుబ్బారాయుడు, రైతు, వీరాయిపాలెం

వరికోతలు వాయిదా వేసుకోవాలి

వ్యవసాయ అధికారి బాలాజీ గంగాధర్

ప్రజాశక్తి-చెరుకుపల్లి

వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి టి.బాలాజీ గంగాధర్ అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలలో పర్య టించి కోతకు వచ్చిన వరి పైరులు పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఏవో మాట్లాడుతూ మరో రెండు రోజులు వేచి చూడా లని, వర్షాలు పడినట్లయితే నీరు నిల్వ లేకుండా కాలువల ద్వారా బయటికి పంపించాలని తెలిపారు. కొన్ని ప్రాంతాలలో లేత పైరు అవడంతో మాని పండు తెగులు వచ్చే అవకాశం ఉందని రైతులకు సూచించారు. లేత పైరుపై మాని పండు తెగులు నివారణకు కార్బన్డిజం ఒక గ్రాము లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి వెన్నులు పైకి వచ్చే దశలో ఒకసారి, వారం రోజుల తర్వాత రెండోసారి పిచి కారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు ప్రియాంక, మాధవి, తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.



వరి పైరును పరిశీలిస్తున్న ఏవో బాలాజీ గంగాధర్

5న మండల సమావేశం

ప్రజాశక్తి- సంతమాగులూరు

సంతమాగులూరు మండల పరిషత్ సమావేశం హాల్‌లో ఈనెల 5వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ వై.ఎలమంద అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో జ్యోతిర్మయి తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, రెవెన్యూ, వ్యవసాయం, సాగు నీరు, తాగునీరు, విద్యుత్, గృహ నిర్మాణం, విద్య, ఆరోగ్యం, పశు వైద్యం, ఐసిడిఎస్, వెలుగు, ఉపాధి హామీ, రహదారులు మొదలగు అంశాలపై సమీక్ష సమావేశం ఉంటుందన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమావేశానికి ముందుగా శాఖలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర నివేదికలను అందజేయాలన్నారు. మండలం లోని ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశా నికి హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

వర్షాలతో రైతుల్లో ఆందోళన

సాగుకు ముందుకు రాని అన్నదాతలు

ప్రజాశక్తి-ఇంకొల్లు

తుఫాను ప్రభావంతో రైతులు ఆందోళన చెందు తున్నారు. కోస్తా తీర ప్రాంతానికి వర్ష సూచన ఎక్కువగా ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు దిగులు చెందుతున్నారు. ఖరీఫ్‌లో ఈ ఏడాది రైతులు తక్కువగా పంటలు సాగు చేశారు. సగటు విస్తీర్ణంలో ఐదో వంతు కూడా సాగు చేయలేదు. ఎక్కువగా ఖరీఫ్ పంటలుగా మొక్కజొన్న, మినుము, పత్తి, వేరుశనగ పంటలు పర్చూరు మరియు చీరాల సబ్ డివిజన్ పరిధిలో సాగు చేశారు. మొక్కజొన్న పంట ఈ పాటికే కోతలకు వచ్చి, కండె వలుపుకు సిద్ధమయింది. కొంతమంది రైతులు ఈ పాటికే కండెలు ఒలిచి ఇళ్లకు చేర్చుకున్నారు. వారికి ఆరబెట్టుకోవటంతో పాటు, ప్లాస్టిక్ పట్టాలతో కప్పుకొని కండెలను కాపాడుకోవడానికి అవకాశం ఉంది.

ఇంకొల్లు మండలంలోని, ఇంకొల్లు నాగండ్ల తాటివారి పాలెం, సూదివారిపాలెం మార్టూరు మండలంలోని బొల్లాపల్లి, బొబ్బేపల్లి, ద్రోణాగల కోళ్లపూడి, తదితర గ్రామాలలో మొక్కజొన్నతో పాటు మినుము పంట కూడా సాగు చేశారు. కొంతమంది మినుము కోతలు కోసి నూర్పిడి చేశారు. కొంతమంది మినుము పంట పొలాలలో కోత దశలో ఉంది, అదేవిధంగా అక్కడక్కడ వేరుశనగ పంట సాగు చేయగా అది కాయ పీకుడు దశకు వచ్చింది.

సందిగ్ధంలో శనగ రైతు

రబీ పంటగా శనగ సాగు చేసిన రైతులు కూడా సం దిగ్ధంలో పడ్డారు. సాధారణంగా ప్రతిఏటా రబీ పంటగా శనగ సాగు చేసి నవంబర్ 15 నుంచి విత్తనాలు ఎద బెట్టడం చేస్తారు. నవంబర్ ఆఖరి వరకు ఈ విత్తనాల ఎద కొనసాగుతుంది. శనగ విత్తనాలు విత్తబోయే ముందు రైతు లు సాధారణంగా మూలసాలు గొర్రు దుక్కి తోలి, తదుపరి ఎకరాకు రెండు నుంచి మూడు బస్తాలలోపు కాంప్లెక్స్ ఎరు వులు కానీ డీఏపీ లాంటి సూటి ఎరువులు కానీ ఎదబెడ తారు. తరువాత వారికి అవసరమైన తెల్లరకం హైబ్రీడ్ శనగలు కానీ నాటు రకం జె జె శనగలు కానీ విత్తనాలు ఎదబెడతారు. కానీ గత ఏడాదితోపాటు, గతంలో పలు సందర్భాలలో శనగ సాగు చేసిన అనుభవాలు దృష్టిలో పెట్టుకుని, ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో ఈ ఏడాది శనగ సాగు చేసే రైతు ఊగిసలాట ధోరణిలో ఉన్నారు.



కోతకు వచ్చిన మొక్కజొన్న పంట



సేంద్రియ ఉత్పత్తులు అమ్ముతున్న దృశ్యం

సేంద్రీయ ఉత్పత్తులతో ఆరోగ్యం

ప్రజాశక్తి-సంతమాగులూరు

సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఉత్పత్తులను ఆహారంలో వినియో గించడం ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన సంతమాగులూరు రెవెన్యూ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయంతో పండించిన పొట్లకాయలు, కాకరకాయలు, ఆకుకూరలను వినియోగదారులకు అమ్మకాలు చేపట్టారు. ప్రతి సోమవారం ఇలాంటి ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలను అమ్ముతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జిలు ఎస్.కె నాగవలి, ఎస్‌కే బాజి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-అద్దంకి

మణికేశ్వరంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్ శ్రీనివాసరావు సందర్శించారు. ఈయన ప్రస్తుతం ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సందర్శన అనంతరం ఆలయ ప్రహరీ గోడ, రాజగోపురం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, ఈవో వాసు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బహుమతులుగా మొక్కలు అందజేత

ప్రజాశక్తి-ఇంకొల్లు

ఇంకొల్లులో ఓ కుటుంబం తన తల్లి దశదినకర్మ సంద ర్భంగా బంధువులకు ఇచ్చే గిఫ్టులకు బదులు మామిడి మొక్కలు అందజేశారు. కరి శేషయ్య భార్య, రాజ్యలక్ష్మి ఇటీవల వృద్ధాప్యంతో మృతి చెందగా సోమవారం దశదినకర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు వచ్చిన బంధువులకు మామిడి మొక్కలను బహూకరించారు. సాధారణంగా ప్రతి ఒక్కరూ దశదినకర్మల్లో తమ బంధువులకు వారి కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం గిఫ్టులుగా పలు రకాల వస్తువులు వారి ఆర్థిక స్థోమతను బట్టి ఇస్తుంటారు. అయితే రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులు వినూత్నంగా ఆలోచించి, బంధువులందరికీ మామిడి మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఇటు వాతావరణ పర్యావరణానికి, ఆర్థిక ఎదుగు దలకు కూడా ఉపయోగపడేలా వినూత్నంగా ఆలోచించి గిఫ్టులు ఇచ్చినందుకు వారి కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.



సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

విద్యార్థులకు సైకిళ్లు అందజేత

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల మండలం నరసాయపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసుల విజయ రాంబాబు (తానా) ఫౌండేషన్ సౌజ న్యంతో పేద విద్యార్థులకు సమకూర్చిన 5 సైకిళ్లను ఎమ్మెల్యే నరేంద్ర వర్మ సోమవారం పార్టీ కార్యాలయంలో విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలం పార్టీ అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, సైకిళ్ల దాత శ్రీనివాసుల విజయ రాంబాబు, కామేపల్లి కృష్ణ బాబు, దీవి రాము, మందపాటి ఆంద్రేయ పాల్గొన్నారు.

మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలి

- వెలిగొండ నిర్వాసితులను ఆదుకోవాలి
- సిపిఎం పట్టణ మహాసభలో తీర్మానాలు..

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం జిల్లా ఏర్పాటుచేయాలని సిపిఎం మార్కాపురం పట్టణ మహాసభ తీర్మానించింది. రెండు రోజులుగా జరుగుతున్న సిపిఎం మార్కాపురం పట్టణ పదో మహాసభలు ముగిశాయి. ఈ సందర్భంగా పలు తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. మెడికల్ కాలేజీని వెంటనే నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించాలని, మెడికల్ కళాశాల నిర్వహణ ప్రభుత్వం కొనసాగించాలని, డాక్టర్ల బదిలీలు నిలుపుదల చేయాలని డిమాండ్ చేసింది. మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేసి సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. పట్టణంలోని అన్ని వార్డులకు తాగునీటి పైప్ లైన్ నిర్మాణం ఏర్పాటు చేసి సాగర్ నీటిని ప్రజలకు అందించాలని కోరింది. అర్హులందరికి ఇంటి స్థలాలు, గృహ రుణాలు మంజూరు చేయాలని, టిడ్కో గృహాలు పూర్తి చేసి వెంటనే లబ్దిదారులకు ఇవ్వాలని సిపిఎం మహాసభ కోరింది. రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న మార్కాపురంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ, పీజీ కళాశాలను ఏర్పాటు చేయాలని, మార్కాపురం చెరువు కట్టను అభివృద్ధి చేసి, మినీ ట్యాంక్ బాండ్‌గా మార్చాలని, పశ్చిమ ప్రకాశంకు నీటి వనరులకు ఉన్న ఏకైక మార్గమైనా పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు మొదటి సొరంగం ద్వారా నీటిని వెంటనే విడుదల చేయాలని కోరింది. అందుకు అవసరమైన కేటాయింపులు బడ్జెట్లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని, నిర్వాసితులను ఆదుకోవాలని మహాసభలో ఏకగ్రీవంగా తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రమేష్ మాట్లాడుతూ తీర్మానాల అమలు కోసం రానున్న కాలంలో పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు.

సిపిఎం పట్టణ కార్యదర్శిగా డికెఎం రఫీ


డికెఎం రఫీ

సిపిఎం మార్కాపురం పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా డికెఎం రఫీ, కమిటీ సభ్యులుగా డి సోమయ్య, పి రూబెన్, జె రాజు, ఎస్.కె నన్నేసా, బి కాశయ్య, జి శారదను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


రూములను ప్రారంభిస్తున్న దృశ్యం

అనాథలకు విద్యాబుద్ధులు నేర్పించేందుకు కృషి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

అనాథ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఆర్డీటి రీజనల్ డైరెక్టర్ నాగరాజు తెలిపారు. సోమవారం మండలంలోని చిన్నగుడిపాడు సమీపంలో గల ఆర్డీటీ కార్యాలయం వద్ద స్పెయిన్ దేశస్తుల ఆధ్వర్యంలో మల్టీ ఫారెన్ ఎడ్యూకేషన్, డార్మెటరి రూములను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబిఆర్ డైరెక్టర్ రఫిక్, ఏడి యుగంధర్‌లు మాట్లాడుతూ ఆర్డీటీ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించి వారిని ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు చదివించనున్నట్లు తెలిపారు. అనంతరం స్పెయిన్ దేశస్తులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఅండ్ఈ గోపాల్, ఏటిఎల్ వేమయ్య, మేనేజర్ సత్తెన్న, సిబ్బంది పాల్గొన్నారు.


రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుంటున్న తహశీల్దార్

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని పెద్ద మసీదు బజారులో గల చివర ఉన్న షేక్ జబివుల్లాకు చెందిన ఒక గదిలో 21 బస్తాల రేషన్ బియ్యం, 12 ప్యాకెట్ల కందిపప్పు, 20 కేజీల లూజు కందిపప్పు ఉన్నట్లు సమాచారం అందడంతో సోమవారం రాత్రి తహశీల్దార్ ఏ బాల కిశోర్ తన సిబ్బందితో వెళ్లి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. స్టాక్ ఉన్న గది తాళం తీయించి.. అందులో ఉన్న బియ్యం, కందిపప్పును పరిశీలించారు. అవి రేషన్ షాపులోవిగా గుర్తించారు. దీంతో వాటిని సీజ్ చేసి నిల్వ ఉంచిన షేక్ జబివుల్లాపై 6ఏ కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది బుజ్జి, దానం, యల్లయ్య, వేమారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-త్రిపురాంతకం

మండలంలోని రాజుపాలెంలో గల తెలుగు బాప్టిస్ట్ చర్చ్‌లో యూత్ సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలుగు బాప్టిస్ట్ చర్చ్ పాస్టర్ నాని జాన్ అధ్యక్షత వహించారు. ముందుగా ముఖ్య అతిథులుగా డాక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఐ శివ బసవరాజు యూత్ సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేసి.. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాస్టర్ జీవన్ బుల్లర్ వాక్యోపదేశం చేశారు. చిన్నారులు నృత్యాలతో అలరించారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్


దుప్పట్లు పంపిణీ చేస్తున్న కందుల

రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద పీట వేసినట్లు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తర్లుపాడు రోడ్డులోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో బాలికలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మార్కాపురం ఉప కలెక్టర్ వెంకట త్రివినాగ్ హాజరయ్యారు. కార్యక్రమంలో మార్కాపురం సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్. అరుణకుమారి, తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు డాక్టర్ మౌలాలి, దొడ్డ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమించి..ఆపై సాగు చేసి..

- పోరంబోకు భూమి కబ్జా - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-త్రిపురాంతకం


ప్రభుత్వ భూమిలో సాగు చేసిన దృశ్యం

త్రిపురాంతకం మండలంలోని మేడపి రెవెన్యూ పరిధిలో గల జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 722, 732లలో 110 ఎకరాల పోరంబోకు భూమి ఉంది. ఈ భూమిని గతంలో కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఆ తర్వాత దాని గురించి పట్టించుకోలేదు. దీంతో కొంత మంది అక్రమార్కులు ఆ భూమిని ఆక్రమించి ఏకంగా వరి సాగు చేశారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఆక్రమణ దారులు కొందరు క్రయవిక్రయాలు కూడా చేసినట్లు తెలిసింది. దీని వెనుక రెవెన్యూ అధికారులతో పాటు రాజకీయ నాయకుల ప్రమేయం ఉన్నట్లు సమాచారం. ఈ భూమి నేషనల్ హైవే రోడ్డుకు ఆనుకొని ఉండడంతో ఆ భూములకు మంచి విలువ ఉంది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి డివిజన్‌నూ శుభ్రంగా ఉంచేందుకు చర్యలు

- ఒంగోలు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్


పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

నగరంలోని ప్రతి డివిజన్ని శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. వార్డుకో వారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహణలో భాగంగా సోమవారం స్థానిక ఎనిమిదో డివిజన్ తూర్పు క్రిస్టియన్‌పాలెంలో ఆయన పర్యటించారు. అక్కడ జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. మురుగు కాలువల శుభ్రత, పిచ్చి మొక్కలు తొలగింపు లాంటి విషయాలు మీద సిబ్బందికి ప్రత్యేకమైన సూచనలు ఇచ్చారు. నగరంలోని ప్రతి డివిజన్ ని శుభ్రంగా ఉంచుతామని కమిషనర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కమిషనర్ వెంట శానిటరీ సూపర్వైజర్ ఎన్ పిచ్చయ్య, డిఈఈ పద్మజ ఉన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం

ప్రజాశక్తి-మార్కాపురం


ఎయిడ్స్ రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అన్నా క్రిష్ణచైతన్య సూచించారు. ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల' విద్యార్థులు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ప్రదర్శనలు సోమవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అనిల్‌కుమార్, ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కాలువ లేక...
రహదారిపై మురుగునీటి ప్రవాహం

ప్రజాశక్తి-మార్కాపురం


రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు

మార్కాపురం మున్సిపాలిటీ లోని 16వ వార్డులో గల భగత్‌సింగ్ నగర్ కాలనీ ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగు కాలువలు లేవు. ఆ రహదారికి ఇరువైపులా ఉన్న నివాసాల్లో వృథా నీరు... మురుగు నీరు కలగలిసి కంపు కొడుతోంది. ఈ నీరంతా రహదారులపై ప్రవహిస్తోంది. దీంతో ఆ ప్రాంత ప్రజలు రాకపోకల సమయంలో ఇబ్బందులకు గురవుతున్నారు.

మార్కాపురం మున్సిపాలిటీలోని భగత్‌సింగ్ నగర్ కాలనీలో గత ప్రభుత్వ కాలంలో మురుగు కాలువలు నిర్మించేందుకు రహదారి ఆసాంతం పొడవాటి గుంతను తీశారు. నిధుల జాప్యంతో పొడవాటి గుంత కాలువగా మారింది. నీటి ప్రవాహంతో సిమెంటు రహదారి అడుగు భాగం కోతకు గురైంది. రహదారి ఎప్పుడైనా కూలిపోతుందని గ్రహించిన అధికారులు కాలువ కోసం తీసిన పొడవాటి గుంతను పూడ్చివేశారు. ఆ నీరంతా ప్రస్తుతం రహదారిపై ప్రవహిస్తోంది. వాహనాల రాకపోకల సమయంలో మురుగు నీరు చిందుతోంది. పాదాచారులపై పడుతోంది. రహదారిపై నిత్యం ప్రవహిస్తున్న మురుగు నీటితో రహదారి జారుడు బల్లగా మారింది. ద్విచక్ర వాహనాలు జారి పడుతున్నాయి. ఆ రహదారిపై నడక అసౌకర్యంగా ఉంది. మురుగు నీటిలో నడవాల్సిందే. సమీపంలో నివాసితులు కంపు భరించలేకున్నారు. మున్సిపల్ అధికారులు అక్కడి అసౌకర్యాన్ని గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు. మురుగు నీటి కంపు తొలగిపోయేలా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. శాశ్వతంగా మురుగు నీటితో ఇబ్బంది లేకుండా రహదారికి ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించాలని అక్కడి ప్రజలు వేడుకుంటున్నారు.



ఎరిక్షన్‌బాబుకు సన్మానం చేస్తున్న దృశ్యం

ఎరిక్షన్‌బాబుకు ఘన సన్మానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కాండ్లావత్ సేవ్యా నాయక్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో సోమవారం యర్రగొండపాలెం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో కాండ్లావత్ సేవ్యా నాయక్ టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబును శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, పోట్ల గోవిందు, ముత్తులూరి మల్లికార్జునచారి, కైపు వెంకటరెడ్డి, గజ్జ వెంకటేశ్వర్లు, శనగ నారాయణరెడ్డి, చేకూరి సుబ్బారావు, ఆకాష్‌రెడ్డి, పుల్లలచెరువు జనసేన మండల అధ్యక్షుడు కటారి అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాగయ్య

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంకు చెందిన వర్క్ చార్జ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఆలేటి నాగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కె కలంధ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి గౌరు నాయుడు చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమం సోమవారం విజయవాడ పేరడైజ్ హోటల్‌లో జరిగింది. ఆ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా వెంకట సుబ్బయ్యను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నివారిద్దాం

మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్

ప్రజాశక్తి- కనిగిరి

జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా 'శుభ్రమైన గాలి, పచ్చని భూమి, స్థిరమైన జీవనం దిశగా ఒక అడుగు' అనే నినాదంతో పురపాలక సంఘం, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సంయుక్తంగా పట్టణం లోని పామూరు బస్టాండులో అవగాహన కల్పించారు. మానవాళిని ముప్పు తిప్పలు పెట్టే వాటిలో పర్యావరణ కాలుష్యం ప్రధానమైనదని మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందు కు ప్రతి సంవత్సరం డిసెంబర్ 2న జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం జరుపుకుంటున్నారని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని అన్నారు. చిన్న దూరాలకు కాలినడకన, సైకిల్ వాడకం, దూరప్రాంతా లకు ప్రజా రవాణా వ్యవస్థను వినియోగిం చుకోవాలని అన్నారు. కాలుష్యం వలన జీవులకు ఊపిరాడదని, దీంతో శ్వాసకోశ వ్యాధులు తీవ్రం అవుతున్నాయని అన్నారు. గుండె, మధుమేహం, క్యాన్సర్లు, బ్రెయిన్ స్ట్రోక్ వంటి జబ్బులకు దారి తీసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. దీంతో పాటు జ్ఞాపక శక్తి, ఏకగ్రత కూడా కోల్పోతారని అవగాహన కలిగించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటితేనే భవిష్యత్తని అన్నారు. శానిటరీ ఇన్స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో నిబంధనలు పాటించడమే ఏకైక మార్గమని సూచిం చారు. ప్లాస్టిక్ వస్తువులు, సంచులు వాడకం భారీగా పెరగడం వలన కాలుష్యానికి కారణమని అన్నారు. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం ఉన్నదని అన్నారు. వాటిని ప్రజలు పాటించి గుడ్డ సంచులు ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమం లో పారా లీగల్ వాలంటీర్లు, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, జీవన్ అండ్ జెడికె ఫౌండేషన్ కో ఆర్డినేటర్ నవ కుమార్, పుర ప్రజలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్


కిడ్నీ బాధితుణ్ణి పరామర్శిస్తున్న దద్దాల నారాయణ

కిడ్నీవ్యాధి బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - పిసిపల్లి

మండలంలోని మారెళ్ల దళిత కాలనీలో కిడ్నీ వ్యాధితో పాటు లివర్ చెడిపోయి అల్లాడుతున్న అంద్ర మాలకొండ య్యకు వైసిపి కనిగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ దద్దాల నారాయణ యాదవ్ సోమవారం రూ.25వేల ఆర్థిక సహాయం అందించారు. గతంలో ప్రజాశక్తిలో 'కొండంత కష్టం' అనే శీర్షికన కథనం ప్రచురితమైనది. స్పందించిన దద్దాల నారాయణ మారెళ్ళ దళిత కాలనీకి వచ్చి మాలకొండయ్యను పరామర్శించారు. వైద్యం కోసం ఆర్థిక సహాయం అందించారు. దాతలు స్పందించి బాధిత కుటుంబానికి సహకరించారని కోరారు. మాలకొండ కుటుంబ సభ్యులు ప్రజాశక్తికి ధన్యవాదాలు తెలిపారు.


ప్రతిభ చాటిన విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం షరీఫ్

నమూనా పరీక్షలో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - సిఎస్ పురంరూరల్

కనిగిరి డివిజన్ స్థాయిలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ మోడల్ టెస్ట్లో మండలంలోని చెన్నపునాయునిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి ప్రతిభ చాటాడు. కనిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డివిజనల్ స్థాయిలో ఎన్ఎంఎంఎస్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. పరీక్షల్లో చెన్నపునాయుని పల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థి కె వర్షిత్ ప్రతిభ చాటాడు. 102 మార్కులతో డివిజన్ స్థాయిలో 12వ స్థానం, మండల స్థాయిలో 3వ స్థానం సాధించాడు. ప్రతిభ చూపిన విద్యార్థి వర్షిత్ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షరీఫ్, ఎస్జిటి ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ అభినందించారు.


దర్శికి చెందిన గర్నెపూడి యోబుకు ఘన సత్కారం

గర్నెపూడి యోబుకు ఘన సత్కారం

ప్రజాశక్తి-దర్శి

విజయవాడ బుక్ ఫెస్టివల్ ప్రాంగణంలో అమరావతి ఆర్ట్ ఫౌండేషన్ తొలి కార్యక్రమంలో భాగంగా జరిగిన శత కవుల సమ్మే ళనంలో 'వాన వచ్చింది రా... మామ... మా ఊరికి...' అనే వచన కవితా పఠనం చేసిన ప్రకాశం జిల్లా దర్శికి చెందిన ప్రముఖ కవి, రచయిత, కవిరత్న, సాహితీ వజ్ర గర్నెపూడి యోబు (జియో)ను సంస్థ వ్యవస్థపక అధ్యక్షులు, కళారత్న డాక్టర్ పొట్లూరి హరికృష్ణ, ప్రముఖ కళా పోషకులు గోళ్ళ.నారాయణ, సాహితీ వేత్తలు బివిబి సత్యనారాయణ, ఎస్ డి సుభాని, అమరావతి ఆర్ట్ ఫౌండేషన్ అధ్యక్షురాలు కె విజయలక్ష్మి చేతుల మీదుగా శాలువా, ప్రశంసా పత్రం, జ్ఞాపిక నుబహుకరించి ఘనంగా సత్కరించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన కవులకు, సన్మానంతో పాటు ప్రశంశ పత్రం అందించారు.

డ్రెయిన్లలో చెత్త వేస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి- కనిగిరి

పట్టణంలోని వ్యాపారస్తులు, వీధి వ్యాపారస్తులు వ్యర్థ పదార్థాలను కాలువల్లో వేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోను న్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ తెలిపారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో పురపాలక పారిశుధ్య అధికారులతో కలిసి ఆయన సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మున్సిపాలిటీలోని రోడ్లను విస్తరణ చేసి అభివృద్ధి చేసేందుకు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. పట్టణంలోని వ్యాపారస్తులు కాలువల్లో ఇష్టానుసారంగా వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్ వస్తువులు వేయడం వల్ల జల, వాయు కాలుష్యం కలుగుతుందని అన్నారు. కనుక డ్రైనేజీ కాలువల్లో వ్యర్థ పదార్థాలు వేయకుండా మున్సిపల్ కార్మి కులకు అంద జేయాలని అన్నారు. మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ పట్టణ ప్రజలు కాలువలు, డ్రైనేజీలు, రోడ్ల ప్రక్కన చెత్త, ఇతర పదా ర్థాలను కుప్పలుగా వేయడం ద్వారా దుర్వాసన వ్యాపించ డంతో ప్రజలు అనేక రకాల అనారోగ్యాలకు గురికావాల్సి వస్తుందన్నారు. వ్యాపారస్తులు రోడ్లపై వ్యర్థాలు, చెత్త, చెదారం వేసినట్లయితే అపరాధ రుసుం చెల్లించాల్సి వస్తుందడని అన్నారు. కార్యక్రమంలో గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, రత్తయ్య పాల్గొన్నారు.


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కొనకనమిట్ల

మండలంలోని సచివాలయంలో ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా పనులు గుర్తించేందుకు సోమవారం గ్రామసభ సర్పంచ్ బూదాల జోసెఫ్ కమలాకర్రావు అధ్యక్షతన నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో చేపడుతున్న పనులను చర్చించారు. పండ్ల మొక్కల పెంపకం, ఫారం పండ్, చెక్ డ్యామ్ తదితర పనులు చేపట్టేందుకు గ్రామ సభలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బూదాల జోసెఫ్ కమలాకర్రావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ఎంతో దోహదపడుతుందని అన్నారు. రైతులు, కూలీలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, టిఎ హరిబాబు, ఉపసర్పంచ్ బాలయ్య, నాయకులు ఎం బాలకోటయ్య, గురవయ్య, నాగరాజు, భూదాల ఆంథోనీ, కోటయ్య, పి వెంకటరత్నం, మేట్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.


గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ కమలాకర్రావు

గురుకుల పాఠశాలకు కుర్చీలు బహూకరణ

ప్రజాశక్తి-దర్శి

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్ఎస్పి కాలనీలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలకు అవసరాల నిమిత్తం 10కుర్చీలను మానవత సంస్థ చైర్మన్ దేవతి వర ప్రసాద్ సోమవారం బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రతి వ్యక్తి తమకు తోచినంత సహాయ, సహకారాలను అందజేయాలని, అప్పుడే మానవ జన్మ సార్థకమౌతుందని తెలిపారు. కార్య క్రమంలో ప్రిన్సిపల్ మాధవరావు, మానవత స్వచ్ఛంద సేవాసంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, వికలాంగుల హక్కుల సాధన కమిటీ రాష్ట్ర ప్రతినిధి సందు వెంకట రావు, నియోజకవర్గ అధ్యక్షుడు ఓబయ్య పాల్గొన్నారు.


కుర్చీలు బహుకరిస్తున్న మానవత సంస్థ చైర్మన్ దేవతి ప్రసాద్

లక్కవరంలో నేత్రదానం

ప్రజాశక్తి-తాళ్ళూరు

మండలంలోని లక్కవరం గ్రామానికి చెంది న సోము ధనమ్మ (51) సోమవారం ఒంగోలులోని రిమ్స్ ఆసుపత్రిలో ఆమె మృతి చెందగా ఆమె కుమా రులు సోము చౌడిరెడ్డి, నాగార్జునరెడ్డి అనుమతితో హైదరాబాద్ ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్యశాల వైద్యులు కార్నియా సేకరించారు. మరొకరికి నేత్రదానం చేయటానికి ఇష్టపడిన కుమారులను పలువురు అభినందించారు.


సోము ధనమ్మ (51)


సైడ్ కాలువపై విరిగిపోయిన సిమెంటు మూతలు

ఆదమరిస్తే ప్రమాదమే..

ప్రజాశక్తి - పామూరు

ఆదమరిచి వాహనాలు నడిపితే ప్రమాదం తప్పదు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులోకి వెళ్లే సైడ్ కాలువ విరిగిపోయి సంవత్సరాలు గడిచింది. నేటికీ మరమ్మతులు చేపట్టడంలో ఆర్అండ్బి అధికారులు, ఆర్టీసీ అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల బైక్పై వెళుతున్న దంపతులు కాలువలో పడి గాయాలైన సంఘటన తెలిసిందే. ఎదురుగా వాహనం వస్తే కాలువలోకి చక్రాలు వెళ్లి ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. వారం క్రితం భార్యా, భర్త బైక్పై పోతూ ఎదురుగా బస్సు రావడంతో అదుపుతప్పి సైడ్ కాలవలో పడ్డారు. చుట్టూ ఉన్నవారు వెంటనే వారిని లేవదీసి ధైర్యాన్ని నింపారు. వారికి ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆర్టీసీ అధికారులు ఈ ప్రమాదాన్ని పట్టించుకోవడంలేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీకి రూ.కోట్ల ఆదాయం వస్తున్నప్పటికీ చిన్న, చిన్న మరమతులు చేయకపోవడం దురదృష్టకరం. ఆర్టీసీ, ఆర్అండ్బి అధికారులు వెంటనే స్పందించి సైడ్ కాలువలు మరమ్మతులు చేసి ప్రమాదాల నుండి కాపాడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కొనుగోళ్లు లేక జొన్నరైతు విలవిల

గిడ్డంగుల్లోనే నిల్వ ఉన్న గత ఏడాది పంట

అద్దెలు చెల్లించలేక రైతుల ఇబ్బందులు

పట్టించుకోని ప్రభుత్వం, పాలకులు

ప్రజాశక్తి-ఇంకొల్లు

ప్రకృతి వైపరీత్యాలు, నకిలీ విత్తనాలు, అధిక పెట్టుబడులతో రైతులు చిత్తవుతున్నారు. అన్నిటికీ ఎదురొడ్డి పంటలు పండించినా పంటలకు గిట్టుబాటు ధర రాక, అటు వ్యాపారులు కొనుగోలు చేయక, ఇటు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ప్రభుత్వ రంగ సంస్థలో కొనుగోలు చేయక విల్లవిల్లలాడిపోతున్నారు. తీవ్రంగా నష్టాలు వచ్చి, అప్పుల పాలవుతున్నారు. కౌలు రైతుల పరిస్థితి ఇంకా అధ్వానంగా ఉంది. 'అమ్మాలంటే అడవి కొనాలంటే కొరివిలా' తయారయింది రైతు కుటుంబాల పరిస్థితి. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా మాటలు తప్ప చేతలు కానరావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన రైతులకు అవసరమయ్యే సమయంలో పంటలు అమ్ముకునేటప్పుడు ధరల్లో కోతలు విధిస్తున్నారు. సరుకు కొన్న వ్యాపారులు వాటిని నిల్వచేసి, అమ్ముకునే సమయంలో మాత్రం ధరలు ఎక్కువగా ఉండేటట్టు వారు లబ్ధి పొందేటట్టుగా వ్యవహారం ఓ తతంగంలా నడుస్తోంది.

పర్చూరు నియోజకవర్గంలో గత ఏడాది ఎర్రజొన్న పంట దాదాపు 500 ఎకరాలలో రైతులు సాగు చేశారు. నియోజకవర్గంలోని చిన్నగంజాం మండలంలో గొనసపూడి గ్రామంలోనే దాదాపు 120 ఎకరాల్లో ఈ పంట సాగు చేశారు. నాగులుప్పలపాడు మండలంలోని ఈదుముడి, మద్దిరాల, ముప్పాళ్ల తదితర గ్రామాలలో కూడా ఈ పంట సాగు చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో దాదాపు 2,500 ఎకరాల్లో సాగు చేశారు. ప్రతి ఏటా శనగ పంట సాగు చేయటం వలన ఎండు తెగులు సోకి పంట దిగుబడులు రాక ప్రత్యామ్నాయంగా పంట మార్పిడిగా గత రెండు మూడు సంవత్సరాల నుంచి రైతులు ఈ పంట సాగు చేయటం ప్రారంభించారు. రెండేళ్ల క్రితం పంట తక్కువగా సాగు చేసినప్పుడు వ్యాపారులు క్వింటా రూ.3



రైతులు పండించిన జొన్నలు

వేల నుంచి రూ.3200 వరకు కొనుగోలు చేసినట్లు రైతులు తెలిపారు. అయితే గత ఏడాది అత్యధికంగా సాగు చేయటంతో పంట పండినా కూడా వాటిని వ్యాపారులు కొనే పరిస్థితి లేదు. అసలు ధర ఎంతైనా కానీ ఇప్పటివరకు ఎర్ర జొన్నలు కొనుగోలు జరగక రైతులు వాటిని కొనే వ్యాపారుల కోసం ఎదురుచూసే పరిస్థితి ప్రస్తుతం ఉంది.

శీతల గిడ్డంగులలోనే పంటలు

గత ఏడాది పండిన ఎర్రజొన్నల పంట నిల్వలు వ్యాపారులు కొనుగోలు చేసేవారు లేక ఇంకొల్లు, ఉప్పుగుండూరు, నాగులుప్పలపాడుతో పాటు వివిధ శీతల గిడ్డంగులలో నిల్వలు ఉన్నాయి. ఒక్క ఉప్పుగుండూరు శీతలా గిడ్డంగులలోనే దాదాపు 2 వేల క్వింటాలు పైగా నిల్వ ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. మళ్లీ పంట సంవత్సరం వచ్చినా కానీ పండిన పంట కొనుగోలు చేసేవారు లేక ఏసి అద్దె కడుతూ నష్టాల పాలవుతున్నామని జొన్న రైతులు వాపోతున్నారు.

కౌలు రైతులు నష్టాల పాలు

సొంత భూమి ఉండి జొన్న పంట సాగు చేసిన రైతుల పరిస్థితి ఒకరకంగా ఉన్నప్పటికీ కౌలుకు పొలం తీసుకొని పంట సాగు చేసిన రైతుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. గత ఏడాది పంట పెట్టుబడి సొమ్ము రాకపోగా ఈ ఏడాది కౌలు, పెట్టుబడికి డబ్బులు రాని పరిస్థితి ఉంది. అటు ఏసీ అద్దెలతో పాటు గత ఏడాది పెట్టుబడుల వడ్డీ ఈ ఏడాది పెట్టుబడులకు వడ్డీ కట్టవలసి వస్తుందని తెలిపారు. తమకు బ్యాంకు రుణాలు సౌకర్యం లేక ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించవలసిన పరిస్థితి తప్పనిసరి అయింది వాపోతున్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి

ఎర్ర జొన్న సాగుకు ఎకరాకు రూ.35 వేల వరకు పెట్టుబడి అవుతుందని సాగు చేసిన రైతులు తెలిపారు. గొనసపూడి, ఉప్పుగుండూరు, ఈదుముడి తదితర ప్రాంతాలలో జొన్న సాగు పంటకు ఎకరాకు కౌలు రూ. 18 వేలు, విత్తనాలకు రూ.2 వేలు, వ్యవసాయం ఖర్చులకు రూ.5 వేలు, ఎరువులకు రూ.3 వేలు, పురుగుమందు, మందు పిచికారీ, కలుపుతీత తదితర ఖర్చులు మరో రూ.3 వేలు, పంట నూర్పిడి, గోనే సంచులకు మరొక రూ.3 వేలు ఖర్చు అవుతుందని తెలిపారు. ఇది గాక ఏసీకి బస్తాలతో బాడుగా ఏసీ అద్దె అదనం ఖర్చులని తెలిపారు. గత ఏడాది ప్రభుత్వం జొన్నలకు రూ.3,180 మద్దతు ప్రకటించిందని, ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరకు జొన్నలు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

200 క్వింటాళ్లు గిడ్డంగిలోనే ఉన్నాయి

- కొండ్రగుంట హరిబాబు, గొనసపూడి



రెండేళ్ల క్రితం ఈ ఎర్రజొన్న సాగు చేస్తే క్వింటా రూ.3 వేల వరకు కొనుగోలు చేశారు. గత ఏడాది నా పొలానికి తోడు కొంత కౌలు పొలం తీసుకొని సాగు చేశాను. ఎకరాకు రూ.18 వేలు కౌలు చెల్లించా. ఎకరాకి 20 క్వింటాళ్ల చొప్పున మొత్తం 200 క్వింటాళ్లు పండాయి. కొనేవారు లేక ఉప్పుగుండూరు ఏసీలోనే నిల్వ ఉంచాము. ఇప్పటివరకు వ్యాపారులు కొనుగోలుకు ముందుకు రాలేదు.

ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి

- మానం సుబ్బారావు, గొనసపూడి



నేను గత ఏడాది ఎనిమిది ఎకరాలలో ఎర్రజొన్న సాగు చేశాను. కొంత కౌలు పొలం తీసుకున్నాను. మా ఊరిలోనే దాదాపు 100 నుంచి 120 ఎకరాల వరకు రైతులు సాగు చేశారు. శనగ పంట సాగు చేయటం వలన అవి తెగుళ్లతో ఎండిపోతున్నాయి. అందుకు ప్రత్యామ్నాయంగా గత ఏడాది ఈ ఎర్రజొన్న పంట సాగు చేసాం. వీటిని కొనేవారు లేరు. ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా నిర్ణయించిన ధరకు కొనుగోలు చేయాలి.

గ్రామసభలు అవినీతిమయం

రైతు సంఘం జిల్లా నాయకులు కందిమళ్ల

ప్రజాశక్తి-మార్టూరు



మాట్లాడుతున్న రామకోటేశ్వరరావు

గతంలో రీసర్వే నిర్వహించిన గ్రామాలలో ఇటీవల ప్రభుత్వం చేపట్టిన గ్రామ సభలన్నీ లోపభూయిష్టం, అవినీతిమయంగా ఉన్నాయని రైతు సంఘం జిల్లా నాయకులు కందిమళ్ళ రామ కోటేశ్వరరావు ఆరోపించారు. సోమవారం ఆయన మార్టూరులో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో రైతులు బ్యాంకు రుణాలు మంజూరు కాక, భూములు రిజిస్ట్రేషన్లు జరగక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే అధికారులు మాత్రం గతంలో రీసర్వే జరిగిన గ్రామాలలోనే నామమాత్రంగా గ్రామసభలు నిర్వహించి మమ అనిపించారని విమర్శించారు. గ్రామ సభలలో ఇచ్చిన అర్జీల పరిష్కార కోసం రైతులు తహశీల్దార్ కార్యాలయాలకు వస్తే వారి అవసరాలను బట్టి అధికారులు లంచాలు డిమాండ్ చేయటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయాన్ని మార్టూరు తహశీల్దార్ ప్రశాంతి దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం కనిపించలేదని ఆయన అన్నారు. జిల్లా లేదా నియోజకవర్గస్థాయి అధికారులతో రెవెన్యూ సమావేశాలు ఏర్పాటు చేసి రైతు సంఘ ప్రతినిధులను, రైతులను భాగస్వామ్యులుగా చేసినప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రైతుల నుంచి లంచాలు డిమాండ్ చేస్తున్న వీఆర్వోలు, సర్వేయర్లపై జిల్లా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి- భట్టిప్రోలు

భట్టిప్రోలులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏపీసీఎంఎఫ్ మాస్టర్ ట్రైనర్ నీలం ప్రకాష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రైతులకు ఆర్‌డిఎస్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వెల్లటూరు యూనిట్, సురేపల్లి యూనిట్, ఐలవరం యూనిట్ ఐసిఆర్ఎఫ్ వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎం వాణిశ్రీ మాట్లాడుతూ రైతులందరూ ఈ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీటీవో ఎస్.వెంకటరమణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ప్రతి ఒక్కరు చేయాల్సి ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండిన కూరగాయలు, ఆకుకూరలు ఎంతో ఆరోగ్యంగా ఉంటాయని, ప్రతి సోమవారం మార్కెట్‌లో పెడుతున్న కూరగాయలు అందరూ కొనుగోలు చేసి వినియోగించుకోవాలన్నారు. అలాగే ఏపీఎం శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామైఖ్య సంఘంలో ప్రకృతి వ్యవసాయం బలోపేతం గురించి డ్వాక్రా యనిమేటర్స్‌కు



కిట్లు అందజేస్తున్న అధికారులు

తెలియజేస్తామని, ప్రకృతి వ్యవసాయం బలోపేతం చేయడంలో మా వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మీరయ్య, పిఓపిఆర్ అండ్ ఆర్‌డి ఊహరాణి, ఏపీవో శివపార్వతి ఏపీసీఎంఎఫ్ మాస్టర్ ట్రైనర్ నీలం ప్రకాష్ కుమార్, సిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.

వైసీపీ గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-భట్టిప్రోలు

వేమూరు నియోజవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు సోమవారం భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరు వైసీపీ నూతన గ్రామ కమిటీని నియమించారు. కమిటీ అధ్యక్షుడిగా వాకా వేంకటేశ్ ఎన్నిక కాగా వారితో పాటు నలుగురు కార్యదర్శులతో కూడిన నూతన కమిటీలను నియమించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డివి లలిత కుమారి, వెల్లటూరు మాజీ సర్పంచి చౌటూరి లక్ష్మి, పార్టీ మండల మాజీ అధ్యక్షులు పడమటి శ్రీనివాసరావు, గుంటూరు సునీల్ కుమార్, చౌటూరు రవీంద్రబాబు, ఉన్నారు.

సిమెంటు రోడ్ల నిర్మాణం పూర్తి

ప్రజాశక్తి - పంగులూరు

'పల్లె పండగ' ద్వారా మంజూరైన సిమెంట్ రోడ్లలో తొమ్మిది సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తయిందని పంగులూరు మండలం పంచాయతీ రాజ్ ఏఈ గడ్డం హనుమంతరావు తెలిపారు. సోమవారం ఏఈ మాట్లాడుతూ మండలంలోని 21 గ్రామాల్లో రూ.3.30 కోట్లతో 33 సిమెంట్ రోడ్లు మంజూరు కాగా వాటికి సంబంధించి 9 రోడ్లు నిర్మాణం పూర్తి చేసినట్లు చెప్పారు.



రక్తదానం చేస్తున్న సురేంద్ర కుమార్

మహిళకు రక్తదానం

ప్రజాశక్తి-అద్దంకి

రక్తహీనత సమస్యతో బాధపడుతున్న కొత్తమాసు లక్ష్మీ కోటేశ్వరమ్మకు పట్టణానికి చెందిన మారం సత్య సురేంద్ర కుమార్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బాధితురాలి కుటుంబ సభ్యులు రక్తదాతకు, సహకరించిన రోటరీ బ్లడ్ బ్యాంకు డైరెక్టర్ చుండూరి మురళీ సుధాకరరావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, ఏజీపీ వై.రమేష్ బాబు పాల్గొన్నారు.



దుప్పట్లు అందజేస్తున్న దాతలు

దుప్పట్లు అందజేత

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు అప్పికట్ల శ్రీనివాసరావు, అనూరాధ (బెంగుళూరు) దంపతుల సహకారంతో 25 దుప్పట్లు అందజేశారు. సోమవారం మండల విద్యాశాఖాధికారి భూదాటి సుధాకర రావు ఈ దుప్పట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ భవిత కేంద్రంలోని విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారం మారువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు డా.ఇందిరా ప్రియదర్శిని, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎమ్.వేదవతి, కొంగల శ్రీనివాసు, పాలపర్తి యోనా, ఆయా లక్ష్మీ పాల్గొన్నారు.



బొమ్మిడి రామకృష్ణను సన్మానిస్తున్న యువకులు

బొమ్మిడి రామకృష్ణకు సన్మానం

ప్రజాశక్తి-నిజాంపట్నం

రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన నిజాంపట్నం టీడీపీ సీనియర్ నాయకులు బొమ్మిడి రామకృష్ణను సోమవారం రాత్రి నిజాంపట్నంలోని ఆయన నివాసంలో మైనార్టీ టీడీపీ సీనియర్ నాయకుడు ఖాదర్ బాబు, అబ్బాస్ ఖాన్ ఆధ్వర్యంలో నిజాంపట్నం ముస్లిం యూత్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యువకులు పలు సమస్యలను బొమ్మిడి రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా తమ ప్రాంతాలలో గత ప్రభుత్వ హయాంలో కీవాల్స్ వేసి వదిలేసిన సీసీ రోడ్లను పూర్తి చేయాలని కోరారు. స్పందించిన అయన అధికారులతో మాట్లాడి త్వరలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపడతానని హామీ ఇచ్చారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని బొమ్మిడి రామకృష్ణ చెప్పారు.



సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్‌కు అర్జీ ఇస్తున్న దృశ్యం

అర్జీలను త్వరితంగా పరిష్కరించాలి..

సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ప్రకర్ జైన్ అధికారులు ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూ ఆక్రమణలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిశీలించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. భూఆక్రమణలపై మండల స్థాయిలో అధికారులు ప్రతి గురువారం ప్రజలు అర్జీలు తీసుకొని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 103 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ , జిల్లా సహకార శాఖ అధికారి శ్యామ్ సన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా ఉద్యాన శాఖ అధికారి జన్నెమ్మ, మార్కెటింగ్ శాఖ ఏడి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

పకడ్బందీగా 'జాతీయ ప్రతిభ' పరీక్షలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జాతీయ ప్రతిభ ఉపకార వేతనాల పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సోమవారం స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆయన సమావేశం నిర్వహించారు. జాతీయ ప్రతిభ ఉపకార వేతనాల పరీక్షలు ఈనెల 8వ తేదీన జిల్లాలో జరుగుతాయని కలెక్టర్ చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పది పరీక్షా కేంద్రాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. 2,319 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బందాలను నియమించామన్నారు. పదిమంది చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 10 మంది అధికారులు, 99 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది2లు ఏర్పడకుండా ప్రాథమిక వైద్యం అందించడానికి 20మంది ఏఎన్ఎం లను నియమించామన్నారు. పరీక్షలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ బస్సులు నడపాలని, విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయించాలన్నారు. పోలీసుల బందోబస్తు నిర్వహించాలని సూచించారు. పరీక్షలు సమర్థంగా నిర్వహించడానికి అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, డీఈవో పురుషోత్తం, అనుబంధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణకు సహకరించాలి

జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న డిఆర్ఒ గంగాధర్‌గౌడ్

దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన సైనికుల కుటుంబాల సహాయార్థం విరాళాల సేకరణలో జిల్లా అధికారులందరూ సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ తెలిపారు. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి సంబంధించి రూపొందించిన గోడపత్రాన్ని సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించారు. సైనికుల కుటుంబాల సహాయార్థం విరాళాల సేకరలో అధికారులు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కోరారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ వారు రూపొందించిన స్టిక్కర్లను జిల్లా అధికారులు అందరూ వారి సిబ్బందిచే కొనుగోలు చేయించాలన్నారు. అధిక మొత్తంలో విరాళాలు సేకరించడం ద్వారా సైనిక కుటుంబాలను ఆదుకోవచ్చన్నారు. ఆ నిధిని జిల్లా సైనిక సంక్షేమ శాఖ వారికి అందించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆపరేటివ్ అధికారి శ్యామ్ సన్, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులను ప్రోత్సహించేలా పోటీలు

క్రీడాపోటీలను ప్రారంభించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అంతర్జాతీ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొన్ని వికలాంగ విద్యార్దులను ప్రోత్సహించేలా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ నెల 3న నిర్వహించనున్న అంతర్జాతీ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఒంగోలులో డిఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాలలో వికలాంగ విద్యార్దులకు నిర్వహించిన క్రీడా పోటీలను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంతర్జాతీ వికలాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని వికలాంగ విద్యార్థులను ప్రోత్సహించేందుకు 10 క్రీడాంశాలలో పోటీలు నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 300 మంది వికలాంగ విద్యార్దులు క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో వికలాంగులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ ఏడి జి.అర్చన, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.లక్ష్మా నాయక్, ఎస్‌సి కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి అంజల, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి రజనీ కుమారి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి, ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల, ఉమా మనో వికాస కేంద్రం. ఎస్ఆర్‌కె చెవిటి మూగ పిల్లల పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.




పరుగుల పోటీలో పాల్గొన్న వికలాంగ విద్యార్థులు

మంత్రి లోకేష్‌ను కలిసిన మాగుంట

జిల్లా సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర విద్యా శాఖమంత్రి నారా లోకేష్‌ను ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, యువ నాయకులు, మాగుంట రాఘవరెడ్డి సోమవారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని పలు సమస్యలపై వీరు చర్చించారు. ఈ సందర్భంగా మాగుంట మాట్లాడుతూ ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీ స్థాపించి చాలా కాలమైనా సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారన్నారు. ఒంగోలు పార్లమెంట్ పరిధిలో పలు పాఠశాలలో తరగతి గదులు నిర్మించాల్సి ఉందన్నారు. వాటి ఏర్పాటుకు అవసరమైన నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి తప్పక చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



లోకేష్‌తో ఎంపీ మాగుంట

రాష్ట్ర రోడ్ల స్థాయి పెంపుపై మాగుంట ప్రశ్న

ఆంధ్రప్రదేశ్ లో గత 5 సంవత్సరాలలో ఎన్ని రాష్ట్ర రోడ్లను జాతీయ రహదారులుగా పెంచారని చెప్పారని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ప్రశ్నించారు. జాతీయ రహదారులుగా స్థాయి పెంచినవి ఎన్ని, మొత్తం ప్రతిపాదనలు, ఆమోదించినవి, పరిశీలనలో ఉన్నవి ఎన్ని అని ప్రశ్నించారు. తిరస్కరించబడినవి, కేటాయించిన నిధులపై ఆయన ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర రోడ్డు రవాణా, హైవేస్ శాఖ మంత్రి, నితిన్ జైరాం గడ్కరీ సమాధానమిస్తూ జాతీయ రోడ్ల సూత్రాలు, అనుసంధాన అవసరం, అంతర్ ప్రాధాన్యత, నిధుల లభ్యతపై ఆధారపడి రాష్ట్ర రహదారులను కొత్త జాతీయ రహదారులుగా స్థాయి పెంపుకు రాష్ట్రాల ప్రతిపాదనలను కేంద్రం ఎప్పటికప్పుడు తీసుకుంటుందన్నారు. గత ఐదేళ్లల్లో ఆంధ్రప్రదేశ్ లో 1,830 కిలో మీటర్ల రోడ్లు కొత్త జాతీయ రహదారులుగా స్థాయి పెంపుదల చేశామన్నారు. ఏలూరు- ప్రకాశం జిల్లా నుంచి వెళ్ళే మూడు రోడ్లను జాతీయ రహదారులుగా ప్రకటించామన్నారు. ట్రాఫిక్ సాంద్రత, రోడ్ల స్థితి, నిధుల లభ్యతపై ఆధారపడి రోడ్ల అభివద్ధి నిర్వహణ నిరంతరంగా జరుగుతుందన్నారు. 2019-20 నుండి 2023-24 వరకు ఆంధ్రప్రదేశ్ కు కేటాయించిన మొత్తం రూ.35,186 కోట్లతో రోడ్లు నిర్మించినట్లు కేంద్ర మంత్రి తెలియజేశారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కషి చేస్తోందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. స్థానిక బాపట్ల ఉన్నత పాఠశాలలో స్టూడెంట్స్ అసెంబ్లీకి కలెక్టర్ సోమవారం హాజరయ్యారు. అసెంబ్లీ కార్యక్రమంలో జాతీయ జెండాను జిల్లా కలెక్టర్ ఎగరవేశారు. విద్యార్థుల నుంచి గౌరవ వందనం ఆయన స్వీకరించారు. తదుపరి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు కష్టపడి చదివి, క్రమశిక్షణతో మెలిగినప్పుడే ఉన్నత స్థాయికి చేరుకోగలరని తెలిపారు. మంచి పౌరులుగా ఎదిగే అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలన్నారు. ప్రతి మనిషికి బాల్యం బంగారం లాంటిదని కలెక్టర్ చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించే సమావేశం డిసెంబర్ 7వ తేదీన బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరుగుతుందని విద్యార్థులకు తెలిపారు. రాష్ట్రస్థాయి కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరవుతున్నారని చెప్పారు. పాఠశాలకు అరుదైన గౌరవం దక్కిందన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, ప్రవర్తన, నైతికత, నైపుణ్యాలను మెరుగులు దిద్దాలనే ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యార్థులంతా బాగా చదువుకోవాలి, ఆడాలి, సంతోషంగా ఉండాలంటూ విద్యార్థులలో స్ఫూర్తిని నింపారు. మీ తల్లిదండ్రులు ముగ్గుల పోటీలు, టగ్గాఫ్ వార్ పోటీలలో పాల్గొనే బాధ్యత విద్యార్థులదేనన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, ఆర్డీవోలు, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



బాపట్ల ఉన్నత పాఠశాలలో స్టూడెంట్స్ అసెంబ్లీకి హాజరయిన కలెక్టర్ జె వెంకట మురళి